సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం | 27 | మే | 2024



అమ్మవారి చీరలకు భలే గిరాకీ
వేములవాడ: రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను ఆలయ ఆవరణలో సదరు కాంట్రాక్టర్ ఆదివారం విక్రయించారు. భక్తులు ఇష్టంగా కొనుక్కున్నారు.



పోచమ్మ బోనాల్లో విప్
వేములవాడ: స్థానిక రెండోబైపాస్‌రోడ్డులో ఆదివారం నిర్వహించిన నల్లపోచమ్మ బోనాల ఉత్సవంలో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
44.0/40.0

వాతావరణం
వాతావరణం ఉక్కబోతగా ఉంటుంది. రోజంతా ఎండలు దంచి కొడతాయి. తీవ్ర వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అండగా ఉంటాం..
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కోనరావుపేట(వేములవాడ): మట్టిపెళ్లలు పడి మృతిచెందిన ఉపాధిహామీ కూలీ మారుపాక రాజవ్వ కుటుంబాన్ని ఆదుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. మండలంలోని వెంకట్రావుపేటలో ఉపాధిహామీ పనులు చేస్తూ మట్టిపెళ్లలు పడి మృతిచెందిన రాజవ్వ కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని, గాయపడ్డ వారికి మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు చారి, పల్లె మంజుల రవీందర్, ఉన్నారు.

ప్రైమరీ స్కూళ్ల సమయం మార్పు సరికాదు
- టీఎస్‌పీటీఏ నాయకులు




సిరిసిల్లటౌన్: ప్రాథమిక పాఠశాలల సమయం మార్పు సరికాదని పాత టైంటేబుల్ పునరుద్ధరించాలని టీఎస్‌పీటీఏ జిల్లా అధ్యక్షుడు వృత్తమ్ విజయ్ కోరారు. సిరిసిల్లలో ఆదివారం సంఘం ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, రాజు, రవీందర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత విద్యాసంవత్సరంలో ప్రాథమిక పాఠశాలల ప్రారంభం సమయం 9.30 గంటలు ఉండగా.. ఈ విద్యాసంవత్సరంలో 9 గంటలకు మార్చడం సరికాదన్నారు. ఉదయం త్వరగా రావాల్సి ఉండడంతో విద్యార్థులు ఏమి తినకుండా ఖాళీ కడుపుతో వస్తున్నారని, ఫలితంగా పోషకాల లోపానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలల మాదిరిగా టైంటేబుల్ మార్చినట్లు చెప్పే అధికారులు.. మరీ అడ్మిషన్ల విషయంలో వయసు నిబంధన ఎందుకు సడలించడం లేదని ప్రశ్నించారు. ప్రైవేట్‌లో మాదిరిగానే ప్రభుత్వ స్కూళ్లలో కూడా మూడేళ్ల వయసుకే అడ్మిషన్ తీసుకునే అవకాశం కల్పించాలని కోరారు.

ఘనంగా 108 పైలట్ల దినోత్సవం



సిరిసిల్లటౌన్: జాతీయ 108 పైలట్ల దినోత్సవాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించారు. 108 జిల్లా మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదానికి గురైన వారిని, ఇతర కారణాలతో బాధపడుతున్న రోగులను గోల్డెన్ అవర్స్‌లో ఆస్పత్రులకు చేర్చుతూ ప్రాణాలు పోస్తున్నారని కొనియాడారు. పైలట్లు పెద్ది శ్రీనివాస్, బరిగె లక్ష్మణ్, నరేశ్, చాణక్య, అనిల్, విక్రమ్, టెక్నీషియన్లు సత్యసాగర్, స్వాతి, ప్రశాంత్, ప్రవీణ్, 102 కెప్టెన్లు రాజశేఖర్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

లాడ్జీలలో పోలీసుల తనిఖీలు



లాడ్జీలో తనిఖీ చేస్తున్న పోలీసులు

సిరిసిల్లక్రైం: జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యల నివారణకు శనివారం అర్ధరాత్రి వేములవాడలోని లాడ్జీలు, హోటళ్లలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా లాడ్జీలు, హోటళ్లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస కోసం లాడ్జీలకు వచ్చే వారి ఆధార్‌కార్డులు, ఇతర గుర్తింపుకార్డులు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు
తంగళ్లపల్లిలోని అరుణ తన ఇంట్లో ఓ యువతితో వ్యభిచారం నిర్వహిస్తుందన్న సమాచారంతో శనివారం రాత్రి పోలీసులు తనిఖీ చేయగా రాహుల్ యాదవ్ అనే వ్యక్తి పట్టుపడినట్లు ఎస్పీ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమరానికి సై..

- రసకందాయంలో అర్బన్‌బ్యాంక్ ఎన్నికలు
- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- 'చైర్మన్‌గిరి'పై ప్రధాన పార్టీల గురి
- అభ్యర్థులను బరిలోకి దింపుతున్న వైనం
- ముక్కోణపు పోటీ



సిరిసిల్ల అర్బన్‌బ్యాంకు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో మరో ఎన్నికల సమరం మొదలుకానుంది. ఇన్నాళ్లు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో రాజకీయపార్టీల నాయకులు హడావిడి చేయగా.. నేటి నుంచి సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఎన్నికల ప్రక్రియ మొదలుకానుంది. సోమవారం నామినేషన్లు స్వీకరించనున్నారు. పార్టీలకతీతంగా జరిగే ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మాత్రం తమ ఆధిపత్యాన్ని చూపుకునే ప్రయత్నం చేస్తున్నాయి. తమ మద్దతుదారులను బరిలో నిలిపి గెలిపించుకునే పనిలో ఇప్పటికే పడ్డాయి. ఇప్పటికే మూడు ప్రధాన పార్టీలు తమ మద్దతుదారులను గెలుపించుకునేందుకు క్షేత్రస్థాయిలో కార్యాచరణను ప్రారంభించాయి. మండుతున్న ఎండలకు సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఎన్నికలు తోడవడంతో మరితం రాజకీయ వేడి రాజుకోనుంది.

ప్రతిష్టాత్మకంగా సహకార ఎన్నికలు
సిరిసిల్ల సహకార అర్బన్‌బ్యాంకు(ఎస్‌సీయూబీ) ఎన్నికలను బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. పార్టీల గుర్తులు లేకున్నా ఈ ఎన్నికల్లో తమ ప్రాబల్యం నిలుపుకునేందుకు ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. గత ఎన్నికల్లో టిక్కెట్లు రాని చోటామోటా నేతలకు ఈ ఎన్నికల్లో మద్దతునిచ్చి గెలిపించుకునే పనిలో పడ్డాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్, ప్రస్తుత అధికార పార్టీ కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలు అర్బన్ బ్యాంకు ఎన్నికలపై దృష్టి పెట్టాయి. ఇందుకు అధిష్టానాల సూచనలు, సలహాలతోపాటు స్థానికంగా ఉన్న పరిస్థితులను బేరీజు వేసుకుని స్థానిక ముఖ్యనేతలు వ్యూహ, ప్రతివ్యూహాల్లో మునిగితేలారు. ఇప్పటి వరకు ఎక్కువ పర్యాయాలు ఒకట్రెండు పార్టీల మధ్య పోటీ నెలకొనగా.. ప్రస్తుతం మూడు పార్టీలు అర్బన్‌బ్యాంకు ఎన్నికల్లో లీడ్ రోల్‌ను పోషిస్తున్నాయి.

పార్టీల మద్దతు కోసం ప్రదక్షిణలు
సహకార ఎన్నికలైనా పార్టీల మద్దతుతో సునాయసంగా గెలువ వచ్చన్న ధీమాతో ఆశావహులు తమ పార్టీల అధిష్టానాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అభ్యర్థుల బలాబలాలను బేరీజు వేస్తూ తమ మద్దతుదారులను ప్రకటించే పనిలో ప్రధాన పార్టీల నేతలు ఉన్నారు. మూడు పార్టీలు బలబలాలు తేల్చుకునే పనిలో పడటంతో ఈ ఎన్నికలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఆశావహులు వీరే..!
అన్ని పార్టీలు, స్వతంత్రుల నుంచి చాలా మంది ఆశావహులు బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నారు. రాపెల్లి లక్ష్మీనారాయణ, గాజుల బాలయ్య, మందాడి శ్రీనివాస్‌రెడ్డి, గుడ్ల సత్యానందం, బోగ శంకర్, సబ్బని నరేందర్, స్వర్గం శేఖర్, బొద్దుల భాస్కర్, చొప్పదండి ప్రమోద్, చొక్కి శ్రీనివాస్, గుజ్జె రవి, సిరిగిరి మురళి, పాటి కుమార్‌రాజు, ఆడెపు మహేందర్, అడిచర్ల సాయికృష్ణ, సూరం విజయ, వేముల చుక్కమ్మ, అడ్డగట్ల దేవదాసు, ఎనగందుల శంకర్, గాజుల పర్శ రాములు, నేరెళ్ల ప్రేమ్‌గౌడ్, వేముల చెన్నయ్య, నాయిని కిషన్, బషీరొద్దీన్, గౌడ లావణ్య, ఆడెపు అనసూర్య, రాపెల్లి సుస్మితప్రవీణ్, కాముని వనిత, స్వర్గం రాజు, ఆడెపు చంద్రకళ, నాయిని భారతి, కొక్కుల ఆంజనేయులు, పత్తిపాక సురేష్, మంచికట్ల శ్రీకాంత్, గంగుల శ్రీనివాస్, మామిడాల రమణ, కోడం సంజీవ్, తాటి వెంకన్న, కట్ల సంజీవ్, సయ్యద్ ఉస్మాన్, ఆడెపు చక్రపాణి, సూరం వినయ్, వడ్నాల సత్యం, చొప్పదండి శ్రీనివాస్, సోమిశెట్టి దశరథంతోపాటు ప్రస్తుతం కౌన్సిలర్లుగా ఉన్నవారి పేర్లు పోటీచేస్తారని వినిపిస్తున్నాయి. పార్టీ మద్దతు లభించకుంటే స్వతంత్రులుగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

12 డివిజన్లలో పోటాపోటీ
సిరిసిల్ల అర్బన్‌బ్యాంకులో 6,175 మంది ఓటర్లు(సభ్యులు) ఉండగా.. 12 డివిజన్లుగా విభజించి ఎన్నికలు నిర్వహిస్తారు. ఒకటి ఎస్సీ, రెండు డివిజన్లు మహిళలకు రిజర్వ్ కాగా.. మిగతా 9 జనరల్ కేటగిరీ. రిజర్వేషన్లు గల 5, 7, 10 డివిజన్లతోపాటు అన్ని డివిజన్లలో బరిలో ఉండేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉత్సాహం చూపిస్తున్నారు.

చైర్మన్ కుర్చీపై ఉత్కంఠ
సోమవారం నుంచి మొదలయ్యే నామినేషన్లపై అన్ని పార్టీలు, స్వతంత్రుల్లో ఉత్కంఠ నెలకొంది. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు పోటీలో ఉండాలని ప్రధాన పార్టీలు చెబుతున్నా భవిష్యత్ రాజకీయ ఉన్నతికి ఈ ఎన్నికలు దోహదం చేస్తాయని ఆశావహులు ఉన్నారు. పార్టీ పరంగా మెజార్టీ సాధిస్తే చైర్మన్ సీటు దక్కించుకోవచ్చనే ఆలోచనతో కొందరు ముందుకుపోతున్నారు. ప్రధాన పార్టీల్లో చైర్మన్ కుర్చీని ఆశించే వారిలో గతంలో, ప్రస్తుతం మున్సిపల్ ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యుల పేర్లు వినిపిస్తున్నాయి. ప్రధాన పార్టీలోని ప్రస్తుత కౌన్సిలర్‌గా ఉన్న ఒకరు అర్బన్‌బ్యాంక్ చైర్మన్ పదవిని ఆశిస్తుండగా.. అదే పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ ఆసక్తి చూపుతున్నారు. వీరిద్దరి మధ్య పార్టీ పెద్దలు సయోధ్య కుదుర్చుతున్నారు. మరో ప్రధాన పార్టీలో కౌన్సిలర్ కొడుకు చైర్మన్ సీటును నమ్ముకుని గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. మూడో ప్రధాన పార్టీలో కూడా చైర్మన్ సీటుపై మాజీ కౌన్సిలర్, ప్రస్తుత కౌన్సిలర్ కొడుకు ఆశిస్తున్నట్లు రాజకీయవర్గాల సమాచారం. మూడు రోజులు జరిగే నామినేషన్ల అనంతరం పార్టీల మద్దతుదారులు, చైర్మన్ సీటును ఆశించే వారి వివరాలు వెలువడనున్నాయి.

కలెక్టర్ పేరిట తప్పుడు పోస్టులు
- నమ్మొద్దని కోరిన అనురాగ్ జయంతి



సిరిసిల్లటౌన్: జిల్లాలోని పలు సోషల్ మాధ్యమాల్లో తన పేరుతో వస్తున్న పోస్టులను ప్రజలు నమ్మొద్దని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదివారం ప్రకటనలో కోరారు. తన పేరుతో 94755455869 నంబరు ద్వారా వస్తున్న పోస్టులను ఖండించారు. తన పేరుతో మోసపూరిత ప్రకటనలు పలు మెసేజ్‌లు, తప్పుడు కథనాలు వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో వస్తున్నట్లు తెలిసిందని, ఎవరూ నమ్మవద్దని కోరారు.

దంచికొట్టిన ఎండ
సిరిసిల్లటౌన్: జిల్లాలో ఆదివారం ఎండ దంచికొట్టింది. రోహిణీ కార్తే ప్రారంభంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో అత్యధికంగా వేములవాడరూరల్ పరిధిలోని వట్టెంలో 44.4, అత్యల్పంగా రుద్రంగి మండలం మానాలలో 40.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇల్లంతకుంటలో 43.8, సిరిసిల్లలో 43.4, వీర్నపల్లిలో 43.2, ఎల్లారెడ్డిపేటలో 43, నామాపూర్‌లో 42.8, నేరెళ్లలో 42.7, గజసింగవరంలో 42.6, మల్లారంలో 42.6, బోయినపల్లిలో 42.5, పెద్దూరులో 42.5, గంభీరావుపేటలో 42.4, నాంపల్లిలో 42.2, కందికట్కూర్‌లో 42.1, మర్రిగడలో 41.9, మర్తనపేటలో 41.5, నిజామాబాద్‌లో 40.9, ఆవునూరులో 40.8, రుద్రంగిలో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా సాయంత్రం గాలిదుమారంతోపాటు చిరుజల్లులు కురవడంతో చెట్లు కూలిపోయాయి.

నకిలీ ఏజెంట్లపై నిఘా

- జిల్లాలో అధికారిక ఏజెంట్లు ఐదుగురే..
- జిల్లా వ్యాప్తంగా 19 కేసులు
- మోసాలకు పాల్పడితే పీడీయాక్టు
- ఎస్పీ అఖిల్ మహాజన్



గల్ఫ్‌ఏజెంట్ ఆఫీస్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

సిరిసిల్లక్రైం: ఉన్న ఊరిలో ఉపాధి లేక గల్ఫ్‌బాట పట్టే వారికి నకిలీ వీసాలు అంటగట్టి మోసాలకు పాల్పడుతున్న వారి ఆటలకు జిల్లా పోలీసులు చెక్ పెడుతున్నారు. నిరుద్యోగ యువత, ఇక్కడ వచ్చే వేతనాలు సరిపోక భారీ వేతనాలు వస్తాయనే ఆశతో పలువురు గల్ఫ్ దేశాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి వారి అవసరాలను సొమ్ము చేసుకునేందుకు నకిలీ ఏజెంట్లు ముందుంటున్నారు. మాయమాటలు చెప్పి భారీగా డబ్బులు గుంజి మోసాలకు పాల్పడుతున్న వారిపై జిల్లా పోలీసులు నిఘా పెట్టారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 19 కేసులు నమోదు చేశారు.

మోసాలు ఇలా..
- విజిట్ వీసా ఇచ్చి అక్కడికి వెళ్లిన తర్వాత మరో ఏజెంట్ ఉంటారని నమ్మించి ముందుగానే లక్షల రూపాయలు దండుకుంటున్న సంఘటనలు ఉన్నాయి.
- గ్రామంలో ఒకరిద్దరికి మంచి కంపెనీల వీసాలు ఇస్తారు. ఇలా స్థిరపడ్డ వారి పేర్లు చెప్పి అలాంటి కంపెనీలకు పంపిస్తామని నమ్మబలికి ఒకేసారి ఎక్కువ మంది దగ్గర డబ్బులు వసూలు చేసి ఉడాయించిన సంఘటనలు ఉన్నాయి.
- మంచి కంపెనీ, సులభమైన పని, ఎక్కువ జీతం ఉంటుందని నమ్మబలికి అక్కడికి వెళ్లిన తర్వాత వారు చెప్పినవి ఎలాంటివి లేకపోగా.. తక్కువ వేతనానికి పనిచేసిన వారు ఉన్నారు.
- ఇలాంటి వాటిని నియంత్రించేందుకు జిల్లా పోలీసుశాఖ గల్ఫ్‌సెల్ పేరిట స్పెషల్ బ్రాంచ్‌ను సీఐ స్థాయి అధికారిని సలహాదారులుగా ఏర్పాటు చేసింది.
- గల్ఫ్ పంపిస్తామని నమ్మబలికి మోసాలకు పాల్పడ్డ వారిపై ఇప్పటి వరకు 19 కేసులు నమోదు చేశారు.

మోసగిస్తే పీడీయాక్టు
అమాయకులకు భారీగా ఉపాధి లభిస్తుందని ఆశ చూపి ఆర్థికంగా కొల్లగొట్టాలని చూసేవారిపై పీడీయాక్టు నమోదుకు వెనకాడమని జిల్లా పోలీస్‌బాస్ హెచ్చరించారు. జిల్లాలో ఐదు ఏజెన్సీలకు మాత్రమే వీసాలు తెప్పించే గుర్తింపు ఉంది. ఈ ఏజెన్సీల ద్వారా గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురైన చట్టప్రకారం న్యాయం దక్కే అవకాశం ఉంటుంది.

జిల్లాలో దాడులు
గల్ఫ్ నకిలీ ఏజెంట్ల స్థావరాలపై ఇటీవల డీఎస్పీ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేశారు. తంగళ్లపల్లి మండలం సారంపల్లికి చెందిన మహమ్మద్ మహబూబ్, రుద్రంగి మండల కేంద్రానికి చెందిన బొండు అంజయ్య, గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన ఓరగంటి రాములుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

లైసెన్స్‌డ్ ఏజెన్సీలనే ఆశ్రయించాలి



జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్స్ ఉన్న ఏజెంట్లను మాత్రమే ఆశ్రయించాలి. వారి ద్వారానే వీసాలు పొందితే భద్రత ఉంటుంది. గల్ఫ్ పంపిస్తామని పాస్‌పోర్టు తీసుకుని ఇబ్బందులకు గురిచేస్తే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. ఊరిలో గల్ఫ్ ఏజెంట్ అని చెప్పుకుని తప్పులు చేసే వారి వివరాలు అందించండి. – అఖిల్ మహాజన్, ఎస్పీ

'గృహజ్యోతి'కి సమ్మర్ ఎఫెక్ట్ !

- పెరిగిన విద్యుత్ వినియోగం
- తగ్గిన జీరో బిల్లులు
- 200 యూనిట్లు దాటితే బిల్లు చెల్లించాల్సిందే..



మీటర్ రీడింగ్ తీస్తున్న సిబ్బంది

బోయినపల్లి(చొప్పదండి): దంచి కొడుతున్న ఎండలకు అందరి ఇళ్లల్లో 24 గంటలు ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు నడుస్తూనే ఉన్నాయి. వేసవి ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు రోజంతా ఫ్యాన్లు వేసే ఉంచుతున్నారు. ఫలితంగా చాలా మంది 200 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరుగ్యారంటీలలో గృహజ్యోతి ఒకటి. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తే ఉచితం. వారు బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ మార్చి నెల నుంచి చాలా మంది వినియోగదారులు 200 యూనిట్లకు మించి విద్యుత్‌ను వినియోగిస్తున్నారు.

సెస్ పరిధిలో 14 సెక్షన్లు
సిరిసిల్ల విద్యుత్ సహకార సంస్థ(సెస్) పరిధిలో 14 సెక్షన్లుగా విభజించారు. ఇందులో సిరిసిల్లటౌన్-1, సిరిసిల్ల–టౌన్2, వేములవాడటౌన్, వేములవాడ రూరల్, వేములవాడఅర్బన్, కోనరావుపేట, చందుర్తి, బోయినపల్లి, ఎల్లారెడ్డిపేట-1, ఎల్లారెడ్డిపేట-2, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట సెక్షన్లు ఉన్నాయి.

తగ్గిన గృహజ్యోతి లబ్ధిదారులు
సెస్ పరిధిలో గృహజ్యోతి పథకానికి 92,082 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో మార్చిలో 87,703 మంది వినియోగదారులు జీరో బిల్లు లబ్ధి పొందారు. మార్చిలో జీరో బిల్ సబ్సిడీ రూ.2,90,77,737. ఏప్రిల్‌లో జీరో బిల్ లబ్ధిదారులు 84,713కు పడిపోగా, మేలో 83,846కు తగ్గారు. రెండు నెలల్లోనే సుమారు రూ.46లక్షల బిల్లులు చెల్లించారు.

సెస్‌లో గృహజ్యోతి లబ్ధిదారుల వివరాలు

గృహవిద్యుత్ కనెక్షన్లు	1,70,596
గృహజ్యోతి పథకానికి అర్హులు	87,703
మార్చిలో అర్హులు	87,703
ఏప్రిల్‌లో అర్హులు	84,713
మేలో అర్హులు	83,846
మార్చి నుంచి ఏప్రిల్ వరకు తగ్గిన లబ్ధిదారులు	2,990
ఏప్రిల్ నుంచి మే వరకు తగ్గిన లబ్ధిదారులు	867

ఈ వేసవిలో తగ్గారు



గృహజ్యోతి పథకం కింద మార్చిలో బోయినపల్లి మండలంలో 7,209 మంది జీరో బిల్ పొందారు. మేలో 6,291 మంది మాత్రమే జీరో బిల్‌కు అర్హులు అయ్యారు. 288 మంది 200 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగించారు. వీరంతా బిల్లులు చెల్లించారు.
– జి.ప్రశాంత్, సెస్ ఏఏఈ, బోయినపల్లి

పొదుపు చేస్తేనే జీరో బిల్లు



వినియోగదారులు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తేనే జీరో బిల్లు పథకానికి అర్హులు. ఈక్రమంలో జీరో బిల్లుల సంఖ్య ప్రతీ నెల మారుతుంటుంది. సిరిసిల్ల సెస్ పరిధిలో గత మార్చిలో 87,703 మంది జీరో బిల్లుకు అర్హులయ్యారు. ఇందులో పలువురు 200 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగించడంలో మేలో 83,846కు తగ్గారు. మళ్లీ విద్యుత్ వినియోగం తగ్గితే జీరో బిల్లు వస్తుంది. – సూర్యచందర్‌రావు, సెస్, ఎండీ

పట్టభద్రులను అవమానిస్తున్నారు

- బీఆర్‌ఎస్‌కు నూకలు చెల్లుతున్నాయ్
- కేటీఆర్ మాటల వైఖరి మార్చుకోవాలి
- కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: అధికారం కోల్పోయిన అసహనంతో మాజీ మంత్రి కేటీఆర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సిరిసిల్లలోని తన నివాసంలో ఆదివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం చేస్తూ పట్టభద్రులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్‌ను ప్రజలు తిరస్కరించినా ఆ పార్టీ పెద్దలకు అధికారంపై వ్యామోహం వీడలేక అవాక్కులు చవాక్కులు మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ యూనివర్సిటీలు మేధావులకు పుట్టినిల్లు లాంటివని కేటీఆర్ తెలుసుకోకపోవడం అతని అవివేకానికి నిదర్శనమన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల విద్యార్థుల పోరాటంతోనే ప్రత్యేక రాష్ట్రం సాధించిన సంగతి మరిచిపోయి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో శ్వేతపత్రం ఇవ్వాలని కోరితే మొహం చాటేసుకుని తిరిగినోళ్లు ఇప్పుడు ఉద్యోగాలు తామే ఇచ్చినట్లు కూతలు కోస్తున్నారన్నారు. కరువు, కరెంటు కోతలు కాంగ్రెస్‌తోనే అంటూ చేస్తున్న ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు. పార్టీ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాయకులు గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, కత్తెర దేవదాసు, గడ్డం కిరణ్, బైరినేని రాము పాల్గొన్నారు.

సిరిసిల్లలో ట్రాన్స్‌జెండర్స్ పెట్రోల్‌బంక్



ట్రాన్స్‌జెండర్స్‌తో పెట్రోల్‌బంక్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు (ఫైల్)

- రాష్ట్రంలోనే మొట్టమొదటి బంక్
- రూ.3కోట్లతో నిర్మాణం
- డీడబ్ల్యూవో లక్ష్మీరాజం

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ట్రాన్స్‌జెండర్స్‌కు పెట్రోల్‌బంక్ సిరిసిల్లలో ఏర్పాటుకానుంది. ఈమేరకు జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం ఆదివారం తెలిపారు. కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలతో బంక్ పనులు నడుస్తున్నాయన్నారు. ట్రాన్స్‌జెండర్లకు భారత ప్రభుత్వం తీసుకొచ్చిన సమాన అవకాశాల చట్టం 2019 ప్రకారం వారికి శాశ్వత ఉపాధికి ప్రత్యేక శ్రద్ధతో కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రూ.3కోట్లతో జిల్లా కేంద్రంలో ట్రాన్స్‌జెండర్లతో పెట్రోల్‌బంక్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన ఎన్‌వోసీ పూర్తయిందని, సిరిసిల్ల రెండో బైపాస్‌రోడ్డులోని మెడికల్ కాలేజీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బంక్ నిర్వహణపై ట్రాన్స్‌జెండర్లకు శిక్షణ పూర్తయిందన్నారు. 15 మంది ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని వివరించారు. త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా ఉపాధి పనులు

- నిలిపివేయించిన ఎంపీడీవో జయశీల



బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని రత్నంపేటలో ప్రమాదం అంచున చేపడుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో జయశీల నిలిపివేశారు. గ్రామంలో వరదకాల్వ పక్కన నిల్వచేసిన ప్రమాదకరమైన గడ్డలో మొరం తీసే పనులను ఉపాధిహామీ కూలీలతో ఫీల్డ్ అసిస్టెంట్ చేయిస్తున్నారు. ప్రమాదకరంగా పనులు చేస్తున్నారని, వాటిని ఆపాలని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు ఎంపీడీవో పని స్థలాన్ని సందర్శించి పనులు నిలిపివేయించారు. పంచాయతీ కార్యదర్శి సరిత, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.



క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతి


నాగరాజు (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: జనగామ–సుందిళ్ల గ్రామ శివారులోని ఇసుక బంకర్ వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు రాసపల్లి నాగరాజు (31) మృతి చెందాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని జవహర్‌నగర్‌లో నివాసముంటున్న నాగరాజు ఆర్జీ–1 డివిజన్ 11 ఇంక్లయిన్ గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం సెకండ్‌షిఫ్టు ముగించుకొని తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా జనగామ శివారులోని ఇసుక బంకర్ వద్ద ప్రధాన రోడ్డుపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్‌ను బలంగా ఢీకొనడంతో హెల్మెట్ పగిలి తలకు దెబ్బ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. నిర్లక్ష్యంగా రోడ్డుపై లారీని ఆపి తన కొడుకు మరణానికి కారణమైన లారీడ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి పోషం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై ఫరిద్ తెలిపారు.

అనంతారం వాసి..


రాజశేఖర్ మృతదేహం

కొత్తపల్లి/తంగళ్లపల్లి: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ పంచాయతీ పరిధిలోని శ్రీరాములపల్లి స్టేజ్ వద్ద కరీంనగర్– వేములవాడ ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. కొత్తపల్లి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామానికి చెందిన జక్కుల రాజశేఖర్ కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం విధులు ముగించుకొని తిరిగి బైక్‌పై వెళ్తున్న క్రమంలో శ్రీరాములపల్లి స్టేజ్ వద్ద అదుపుతప్పి కల్వర్టు గోడను ఢీకొట్టడంతో రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాజశేఖర్‌కు ఇటీవలే వివాహం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొత్తపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని బాలిక ఆత్మహత్య

పాలకుర్తి: ఓ యువకుడి లైంగిక వేధింపులు భరించలేక బాలిక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాలకుర్తి మండలం జీడీనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని బీసీకాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలం గుర్రాంపల్లికి చెందిన బాలిక కొంతకాలంగా బీసీకాలనీలో నివాసముంటోంది. పెద్దపల్లి మండలం బొంపెల్లికి చెందిన అరికిళ్ల శ్యాం కొంతకాలంగా బాలికను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈనేపథ్యంలో వేధింపులు తాళలేక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు బసంత్‌నగర్ రెండో ఎస్సై శివాణిరెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

షెటర్స్ కిరాయికి ఇవ్వబడును

■ KNR, కోతిరాంపూర్ చౌరస్తా నుండి ఆన్నమనేని గార్డెన్ లైన్‌లో size 10/25 గలవి 4 షెటర్స్ కిరాయికి ఇవ్వబడును. సంప్రదించండి. సెల్: 9848996412 [K-1187403]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185088]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K Ph: 9640258899/ 9640468899 [H-799885]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

అంజన్న చెంత.. వసతుల చింత

- ఐదు రోజుల్లో హనుమాన్ పెద్ద జయంతి
- నత్తనడకన ఏర్పాట్లు
- లక్షల్లో రానున్న భక్తులు


చెత్తాచెదారంతో నిండిపోయిన మురుగుకాలువ


అంజన్న ఆలయంలో భక్తులు


నీటిట్యాంకు వద్ద అపరిశుభ్రత


కోనేరు సమీపంలో చెత్తాచెదారం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆలయంలో మరో ఐదు రోజుల్లో హనుమాన్ పెద్ద జయంతోత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలకు లక్షలాది మంది హనుమాన్ భక్తులు, దీక్షాపరులు తరలివస్తారు. కానీ భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు మాత్రం నత్తనడకన కొనసాగుతున్నాయి.

ఖర్చు లక్షల్లో.. ఏర్పాట్లు నామమాత్రం

ఏటా హనుమాన్ జయంతికి వసతుల నిమిత్తం ఆలయ అధికారులు రూ.లక్షల్లో ఖర్చు చేస్తారు. కాగా జయంతికి వారం రోజుల ముందే అన్ని ఏర్పాట్లు చేయాలి. ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ కారణం చూపి ఆలయానికి రంగులు వేయలేదు. తాత్కాలికంగా దుకాణాదారుల సాయంతో నామమాత్రగా రంగులు పూర్తి చేశారు. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు వేశారు. చలివేంద్రాలు ఇంకా ఏర్పాటు చేయలేదు. అలాగే ఘాట్‌రోడ్ వెంట ఇరువైపులా ఉన్న స్థలంలో, లడ్డూప్రసాదం తయారీ కేంద్రం వద్ద భక్తులు వాహనాలు నిలపడంతో పాటు విశ్రాంతి తీసుకుంటారు. అందుకు తగిన ఏర్పాట్లు కానరావడం లేదు. ఆలయ పరిసరాలు కంపుకొడుతున్నాయి. కోనేరు సమీపంలో, తాగునీరు నల్లాల వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.

తాత్కాలిక స్టాండ్‌లతోనే..

ఏటా హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తుల కోసం తాత్కాలిక స్టాండ్‌లు, వైర్లతో క్యూలైన్‌లు ఏర్పాటు చేస్తుండగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సదరు క్యూలైన్లలో ఎవరైనా భక్తులు దారితప్పితే మళ్లీ ఆలయం ఎదుట ఉన్న కార్యాలయం నుంచి దారిపట్టాలి. ఇలా సుమారు 2 గంటల నుంచి 3గంటల సమయం వృథా అవుతోంది. ఇలా స్వామి వారి దర్శనం, మాల విరమణ, కోనేరు వద్ద భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈసారైనా ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.


తాత్కాలిక స్టాండ్‌లు

నిర్లక్ష్యం తగదు



లక్షల మంది తరలివచ్చే ఉత్సవాలకు అధికారులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేయాలి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలి. ఏర్పాట్లలో నిర్లక్ష్యం తగదు.

– నరేశ్, గంగాపూర్

ఏర్పాట్లు కొనసాగుతున్నాయి



హనుమాన్ జయంతికి వచ్చే భక్తులకు కావల్సిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరో రెండు రోజుల్లో అన్ని సౌకర్యాలు పూర్తవుతాయి. లోటుపాట్లు ఉంటే వెంటనే సరిచేసి దీక్షాపరులు ప్రశాంత వాతావరణంలో మాల విరమణ చేసేలా చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, ఆలయ ఈవో

గంభీరావుపేటవాసికి లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు


అవార్డు అందుకుంటున్న అజ్మతుల్లా హుస్సేనీ

గంభీరావుపేట(సిరిసిల్ల)/కరీంనగర్ కార్పొరేషన్: గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. ది టైమ్స్ ఇంగ్లిష్ మ్యాగజైన్ అజ్మతుల్లా హుస్సేనీని భారత్‌కి అన్మోల్ అవార్డుల్లో భాగంగా లీడర్‌షిప్ అండ్ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు(మైనార్టీ డెవలప్‌మెంట్ విభాగం)ను అందించింది. మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అజ్మత్ అవార్డును అందుకున్నారు. పలువురు స్థానికులు ఆయనకు అభినందనలు తెలిపారు.

అనారోగ్యం ఏదైనా ఎమర్జెన్సీనే

- మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వరల్డ్ ఎమర్జెన్సీ డే


హెల్త్‌టాక్‌లో మాట్లాడుతున్న మెడికవర్ వైద్యులు

కరీంనగర్‌టౌన్: అనారోగ్యం ఏదైనా దాన్ని ఎమర్జెన్సీగానే భావించి బాధితుడిని ఆస్పత్రికి తరలించాలని మెడికవర్ వైద్యులు సూచించారు. వరల్డ్ ఎమర్జెన్సీ డేను పురస్కరించుకొని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం విద్యానగర్‌లోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెల్త్‌టాక్, ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 300 మంది వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధులకు మూల కారణమైన బీపీ, షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలన్నారు. ఆహారం, ఇతర అలవాట్లపై నియంత్రణ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. 23ఏళ్లకే హార్ట్‌స్ట్రోక్ వచ్చిన పేషెంట్లను కూడా చూస్తున్నామని, ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే మద్యం, స్మోకింగ్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండడంతో పాటు వ్యాయామం అవసరం ఉందన్నారు. 17వ డివిజన్ కార్పొరేటర్ కోల భాగ్యలక్ష్మి ప్రశాంత్, మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, ఎమర్జెన్సీ ఫిజీషియన్లు వేముల సత్యనారాయణ, విద్యా ప్రకాశ్, రుత్విక్, దీక్షిత్, క్రిటికల్ కేర్ హెచ్‌వోడీ ఉపేందర్ రెడ్డి, న్యూరో సర్జన్ వెంకటేశ్, యూరాలజిస్ట్ రవిశంకర్, మెడికల్ సూపరింటెండెంట్ రవిమల్లారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు హనుమాండ్ల రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

ముల్సిపల్ కౌన్సిలర్ 'కొంతం' హఠాన్మరణం


కొంతం శ్రీనివాసరెడ్డి (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్ కొంతం శ్రీనివాసరెడ్డి (56) ఆదివారం హఠాన్మరణం పొందారు. వారం రోజుల క్రితం స్నేహితులతో కలిసి వైష్ణవి ఆలయాన్ని దర్శించుకుని తిరుగుపయనమవుతుండగా ఢిల్లీలో గుండెపోటుకు గురయ్యారు. వెంట ఉన్న మిత్రులు వెంటనే అక్కడి ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. కొంతం శ్రీనివాసరెడ్డి బీజేపీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడిగా, రైల్వే హమాలీ సంఘ అధ్యక్షుడిగా, హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఈ ప్రాంత ప్రజలందరికీ సుపరిచితుడు. శ్రీనివాసరెడ్డి ఆకస్మిక మృతికి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్, కౌన్సిలర్లు పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియలు సోమవారం సాయంత్రం పెద్దపల్లిలో నిర్వహిస్తారని కుటుంబీకులు తెలిపారు.

కారును ఢీకొన్న లారీ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారిపై ముందుగా వెళ్తున్న కారును ఓ లారీ ఢీకొంది. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారి ట్రాఫిక్ సిగ్నల్ దాటిన తర్వాత గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ బ్రేకులు పనిచేయక పోవడంతో ముందు వెళ్తున్న కారును వెనుక భాగంలో ఢీకొంది. తృటిలో ప్రమాదం తప్పింది. లారీ బ్రేకులు పడకపోవడంతో ఢీకొన్నట్లు డ్రైవర్ హకీమ్ తెలిపారు. కారు డ్రైవర్ అన్వేష్‌కు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.


గంజాయి సేవిస్తున్న నలుగురి రిమాండ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలకేంద్రంలోని బతుకమ్మతెప్ప వద్ద గంజాయి సేవిస్తున్న ఒడ్యారం గ్రామానికి చెందిన అజయ్, సోమారంపేటకు చెందిన తడకపల్లి శేఖర్, అనంతారం గ్రామానికి చెందిన దారవేణి మహేశ్, గొల్లపెల్లికి చెందిన పున్ని ప్రశాంత్‌లను రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్లరూరల్ సీఐ సదన్‌కుమార్ తెలిపారు. వారి నుంచి 100 గ్రాముల గంజాయి, ఒక పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయి గురించి సమాచారం పోలీసులకు తెలిపాలని కోరారు. ఇల్లంతకుంట ఎస్సై ఎల్.రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కమాన్‌పూర్: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి శివారు ప్రాంతంలోని మానేరువాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలించొద్దని ఆదేశాలు జారీ చేసినా కొంతమంది ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు గట్టెపల్లి నుంచి కమాన్‌పూర్‌కు వస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

పంచర్ షాపు దగ్ధం


దగ్ధమైన పంచర్ షాప్

కోరుట్ల: పట్టణ శివారులోని కంచరకుంట ప్రాంతంలో ఆదివారం పంచర్‌షాపు దగ్ధమైంది. ఓ రైతు తన పొలంలో కొయ్యకాలుకు నిప్పుపెట్టగా మంటలు కోరుట్ల–మెట్‌పల్లి జాతీయ రహదారి వరకు వ్యాపించాయి. రోడ్డు పక్కనే కైసర్ అనే వ్యక్తికి చెందిన రేకులతో నిర్మించుకున్న పంచర్ షాపు పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.ఒక లక్ష నష్టం వాటిల్లిందని, ఉపాధి కోల్పోయానని బాధితుడు వాపోయాడు. కాగా ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి చెందిన 10 టేకు దుంగలు కూడా దగ్ధమయ్యాయి.

వడదెబ్బతో రైతు మృతి

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని రాపల్లి గ్రామానికి చెందిన రైతు ఎక్కల్‌దేవి రాజయ్య (60)వడ్డదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజయ్య ఆదివారం తన పొలంలో వరి కొయ్యలకు నిప్పు అంటించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అక్కడే గడిపాడు. ఇటు ఎండ తీవ్రత, అటు అగ్గి దగడుకు వడదెబ్బతో అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు.

వెంకట్రావుపేట మాజీ సర్పంచ్ రిమాండ్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని వెంకట్రావుపేట మాజీ సర్పంచ్ మంతెన సంతోష్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గతంలో వెంకట్రావుపేట మూలవాగు నుంచి ఇసుకను తరలించే ట్రాక్టర్ల నుంచి విలేజ్ డెవలప్‌మెంట్ ఫండ్ పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని తెలిపారు. ఈ విషయమై విచారణ చేపట్టగా సంతోష్‌పై అభియోగాలు నిర్ధారణ కావడంతో కోర్టు అనుమతితో రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

తండ్రి చితికి నిప్పుపెట్టిన కూతురు

శంకరపట్నం: తండ్రి చితికి చిన్నకూతురు నిప్పు పెట్టిన సంఘటన మండలంలోని కొత్తగట్టులో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నల్ల మహేందర్‌రెడ్డికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెద్ద కూతురు సంధ్యకు వివాహం జరగగా.. హైదరాబాద్‌లో నివాసం ఉంటోంది. మూడు రోజుల క్రితం మహేందర్‌రెడ్డి పెద్దకూతురు వద్దకు వెళ్లగా గుండెనొప్పితో శనివారం చనిపోయాడు. మహేందర్‌రెడ్డి అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామంలో జరగగా చిన్నకూతురు అనూష తండ్రి చితికి నిప్పు పెట్టింది.

అజ్మీరాతండాలో పిడుగుపాటు


కొబ్బరి చెట్టుపై పడ్డ పిడుగు

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం సీతారాం నాయక్‌తండా గ్రామపంచాయతీ పరిధిలోని అజ్మీరాతండాలో కొబ్బరిచెట్టుపై శనివారం రాత్రి పిడుగుపడింది. పక్కనే ఉన్న గడ్డికుప్పలకు మంటలు అంటుకోకుండా తండాకు చెందిన అజ్మీర వసంత్ అప్రమత్తమయ్యాడు. తండావాసులతో కలిసి మంటలు అంటుకోకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నాడు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన వెంశ కనకమ్మ(60) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. ఇటీవల తాడికల్‌లోని జాతీయ రహదారిపై డీజిల్ ట్యాంకర్ బోల్తాపడి కనకమ్మ తీవ్రంగా గాయపడింది. 12రోజుల పాటు చావుబ్రతుకులతో పోరాడి ఆదివారం చనిపోయింది. ట్యాంకర్ ప్రమాదం ఘటనలో మృతుల సంఖ్య రెండుకు చేరడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

బీరయ్య పట్నాల వేడుకల్లో అపశృతి

- కళ్లెదుటే కొడుకు మృతి
- బాధిత కుటుంబంలో విషాదం


వెంకటేశ్ (ఫైల్)

గొల్లపల్లి(ధర్మపురి): నమ్ముకున్న వృత్తి ఆ కుటుంబానికి గర్భశోకం మిగిల్చింది. కళ్లెదుటే కొడుకు మృతిచెందడం తీరని విషాదం నింపింది. గ్రామస్తుల వివరాలు.. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం నార్లపురం గ్రామానికి చెందిన బిర్లా రాజయ్య బీరప్ప పట్నాలు వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఇద్దరు కొడుకులు నరేశ్, వెంకటేశ్. ఈక్రమంలో గొల్లపల్లి మండలం చందోళిలో బీరప్ప పట్నాలు ఉండటంతో రాజయ్య తన ఇద్దరు కొడుకులు, ఇతర సభ్యులతో ఈనెల 24న వచ్చారు. 25న సాయంత్రం కురుమ సంఘం ఆచారం ప్రకారం బీరప్ప పట్నాల ఉత్సవాల్లో భాగంగా స్వామివారల విగ్రహాలను చిన్నవేని చంద్రయ్య వ్యవసాయ బావిలో దాచిపెట్టారు. వాటిని నీటిలో నుంచి బయటకు తీసేందుకు రాజయ్య ఇద్దరు కొడుకులు బావిలోకి దూకారు. విగ్రహాలను వెలికితీసే క్రమంలో చిన్న కొడుకు వెంకటేశ్ కొంతసేపటి వరకు నీటి నుంచి బయటకు రాలేదు. పెద్ద కొడుకు బయటకు వచ్చాడు. తమ్ముడు రాకపోవడంతో మరోసారి నరేశ్ బావిలోకి దూకి వెతుకుతుండగ నీటిలో అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేశ్‌ను బయటకు తీసకువచ్చారు. చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

రాజన్నా.. ఇదేమి గోస?

- లడ్డూ ప్రసాద తయారీ కేంద్రంలో వసతులు కరువు
- వేములవాడలో చెమటలు కక్కుతూ పనిచేస్తున్న కార్మికులు
- స్వచ్ఛందంగా హాజరవుతున్న పలువురు మహిళలు
- సౌకర్యాల లేమితో ఇబ్బంది


లడ్డూ తయారు చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

వేములవాడ: రాజన్న లడ్డూ ప్రసాద తయారీ కేంద్రంలో అరకొర వసతులతో కార్మికులు పనిచేయలేకపోతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. బోంది తయారీకి వాడే గ్యాస్ మంటతో గోదాంలో సిబ్బంది, కార్మికులు ఉండలేకపోతున్నారు. కూలర్లు పెట్టించిన ఉక్కపోత తగ్గక చెమటలు కక్కుతూ అతికష్టం మీద లడ్డూలు తయారు చేస్తున్నారు.

ఔట్‌సోర్సింగ్‌తో ఇబ్బంది

రాజన్నను దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు లడ్డూ ప్రసాదాన్ని కొనుక్కొని ఇంటికి తీసుకెళ్తుంటారు. నిత్యం వచ్చే భక్తులకు తోడు జూన్ 1న హనుమాన్ జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు కొండగట్టుకు వచ్చే మాలధారులు వేములవాడ రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ. ఎక్కువ సంఖ్యలో లడ్డూలు తయారు చేయాల్సి ఉండడం.. గోదాంలో అందరూ ఔట్‌సోర్సింగ్ సిబ్బందే ఉండడంతో ఇబ్బందిగా మారింది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, గోదాంలోని పొయ్యిల ద్వారా వచ్చే వేడి కలిసి తీవ్ర ఉక్కపోత ఉండడంతో అక్కడ కార్మికులు, సిబ్బంది ఎక్కువ సమయం ఉండలేకపోతున్నారు.

మండుతున్న ఎండలతో ఉక్కపోత

ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రసాద తయారీ గోదాంలో ఉక్కపోత పెరిగింది. లడ్డూలు తయారు చేసే క్రమంలో ఉక్కపోతతో ఊపిరి పీల్చుకోవడం కూడా ఇబ్బందిగా ఉంటుందని ప్రసాదాలు తయారు చేసే సిబ్బంది పేర్కొంటున్నారు. లడ్డూల తయారీకి ప్రత్యేక భవనం నిర్మిస్తే ఈ సమస్యలు తీరుతాయని సిబ్బంది తెలుపుతున్నారు. బోంది తయారీ చేసే గది, లడ్డూలు చేసే హాలు ఒకటే కావడంతో ఉష్ణోగ్రతలు పెరిగి ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు.

సిబ్బంది కొరత ఉంది

లడ్డూ ప్రసాదాల తయారీకి సిబ్బంది కొరత ఉంది. ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో పనులు చేయిస్తున్నాం. హనుమాన్ జయంతికి లడ్డూల తయారీకి ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేశాం. సరైన వసతి లేకపోవడం, సిబ్బంది కొరత ఉండడంతో ఆటంకంగా మారుతోంది. ఈ విషయాన్ని చాలాసార్లు ఉన్నతాధికారులకు తెలియజేశాం.

– ప్రతాప నవీన్, ఏఈవో


కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఓ కుటుంబం


ఆలయంలో క్యూలైన్లలో భక్తులు


రాజన్నను దర్శించుకునేందుకు ఆలయంలో భక్తులు

రాజన్నకు పోటెత్తిన భక్తులు

- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- దర్శనానికి మూడు గంటలు

వేములవాడ: వేసవి సెలవులు దగ్గరపడుతుండడంతో రాజన్నను దర్శించుకునేందుకు వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఆదివారం దాదాపు 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. రద్దీ పెరగడంతో దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు.